సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 24 । జనవరి । 2024



సేంద్రియ సాగే మేలు

రసాయన ఎరువుల అధిక వినియోగంతో పంటలో సూక్ష్మ పోషకాలు లోపిస్తాయి. సేంద్రియ సాగు వల్ల ఈ సమస్యలకు చెక్ పెట్టవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 10 లో



పర్యావరణాన్ని రక్షించాలి

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరులో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 10 లో



పులి పాదముద్రల సేకరణ

బుట్టాయగూడెం మండలం ఎర్రాయిగూడెం సమీపంలో పులి పాదముద్రలను మంగళవారం ఫారెస్ట్ అధికారులు సేకరించారు. వాటిని రాజమండ్రి ల్యాబొరేటరీకి పంపించారు. 10 లో

సర్వోత్తమ సేవలు

ఇదే కదా గ్రామ స్వరాజ్యం

- ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ
- అందుబాటులో 35 శాఖలకు చెందిన 500 రకాల సేవలు
- 535 సచివాలయాల్లో ఐదు వేలకు పైగా ఉద్యోగాల కల్పన
- 50 ఇళ్లకు ఒకరు చొప్పున 9,260 మంది వలంటీర్ల నియామకం
- ఇప్పటివరకు 31,70,904 అర్జీలు సకాలంలో పరిష్కారం
- సత్వర, వేగవంత, నాణ్యమైన సేవలపై ప్రజల్లో హర్షాతిరేకాలు

మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్ఫూర్తిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన గ్రామ, వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ప్రజలకు సర్వోత్తమ సేవలందిస్తున్నాయి. పింఛన్, రేషన్ కార్డు, ఇంటి పట్టా, ఏదైనా సర్టిఫికెట్ కావాలన్నా.. సమస్య ఏదైనా 72 గంటల్లో గ్రామ/వార్డు సచివాలయాల్లో పరిష్కారం లభిస్తోంది. 35 శాఖలకు చెందిన 500 రకాల సేవలను సచివాలయాల ద్వారా పారదర్శకంగా అందిస్తూ దేశంలోనే సరికొత్త చరిత్ర సృష్టించారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.



జిన్నూరులో సచివాలయంలో ఉద్యోగులు

సాక్షి, భీమవరం: స్థానిక సంస్థలను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం 2019 అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున సచివాలయ వ్యవస్థను ప్రారంభించింది. గ్రామాల్లో రెండు వేలు, పట్టణాల్లో నాలుగు వేల జనాభాకు ఒక సచివాలయం ప్రాతిపదికన జిల్లాలో 535 సచివాలయాలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో మాదిరి సిబ్బంది కొరత లేకుండా గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఎస్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్, ఉద్యాన అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ తదితర పోస్టుల ఏర్పాటు ద్వారా జిల్లాలో ఐదు వేల మందికి పైగా నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల కల్పన జరిగింది. విద్య, వైద్యం, శానిటేషన్, రెవెన్యూ, వ్యవసాయం, సంక్షేమం, తాగునీరు, విద్యుత్ తదితర 35 శాఖలకు చెందిన 500లకు పైగా సేవలను అందుబాటులోకి తెచ్చారు. వీటిలో పలు సేవలను దరఖాస్తు చేసిన వెంటనే అక్కడికక్కడే పరిష్కరిస్తుండగా, కొన్ని 72 గంటల వ్యవధిలో, మరికొన్ని 72 గంటలు దాటి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తున్నారు. సచివాలయాలకు అనుబంధంగా తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థ ద్వారా జిల్లాలో 9,280 మంది వలంటీర్లుగా తమ పరిధిలోని 50 కుటుంబాల వారికి ప్రభుత్వ పథకాల లబ్ధిని చేరవస్తూ నెలకు రూ.5 వేల గౌరవ వేతనాన్ని అందుకుంటున్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో సొంత వారు సైతం దగ్గరకు రాలేని పరిస్థితుల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు బాధితులకు బాసటగా నిలిచారు.

నాలుగేళ్లలో 31,70,904 సేవలు

గత ప్రభుత్వంలో సమస్యల పరిష్కారానికి, ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. సచివాలయ వ్యవస్థ వచ్చాక రికార్డు స్థాయిలో ప్రజలకు సేవలు అందుతున్నాయి. సచివాలయ వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని సచివాలయాల ద్వారా 31,70,904 సమస్యలు పరిష్కరించడం విశేషం. గత ప్రభుత్వాలతో పోలిస్తే రికార్డు స్థాయిలో ప్రజలకు సేవలు అందినట్టు అధికారులు చెబుతున్నారు. గతంలో అసాధ్యం అనుకున్న పనులను సచివాలయ ఉద్యోగులు సుసాధ్యం చేసి చూపిస్తున్నారు. ఏళ్ల తరబడి అందని రేషన్‌కార్డులను కేవలం దరఖాస్తు చేసిన అరగంటలోనే లబ్ధిదారుల చేతికి అందిస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా సచివాలయ సేవల వివరాలు

నియోజకవర్గం	సచివాలయాలు	అందించిన సేవలు
భీమవరం	84	4,87,593
ఉండి	81	4,43,221
నర్సాపురం	59	3,33,105
పాలకొల్లు	68	3,95,754
ఆచంట	63	3,41,025
తణుకు	82	4,88,613
తాడేపల్లిగూడెం	82	5,38,455
గణపవరం మండలం	20	1,43,138



సేవలు సులభతరమయ్యాయి



సచివాలయ వ్యవస్థ లేనప్పుడు ప్రజలు చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఇప్పుడు అన్ని శాఖల కార్యకలాపాలకు సచివాలయం కేంద్ర బిందువుగా ఉంది. ఏ సమస్య అయినా సచివాలయానికి వెళితే సకాలంలో పరిష్కారమవుతోంది.

– కొలుకులూరి ధర్మరాజు, జిల్లా సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు, ఆనందపురం, కాళ్ల మండలం

ఆదర్శంగా తీర్చిదిద్దారు



గతంలో సర్పంచ్‌గా పనిచేశాను. గతానికి ఇప్పటి సచివాలయ వ్యవస్థకి ఎంతో తేడా ఉంది. సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వచ్చాక సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఆదర్శంగా తీర్చిదిద్దారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు.

– కోమటి రాంబాబు, మాజీ సర్పంచ్, తాడేరు, భీమవరం మండలం

కాలయాపన లేదు



గతంలో పనిని బట్టి ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు అన్ని సేవలు సచివాలయంలోనే అందిస్తుండటంతో వ్యయప్రయాసలు తొలగిపోయాయి. నిర్ణీత వ్యవధిలోనే పని పూర్తిచేయడం వల్ల కాలయాపన ఉండటం లేదు.

– దూనబోయిన సత్యనారాయణ, జున్నూరు, పోడూరు మండలం

రేషన్‌కార్డు, పింఛన్ ఇచ్చారు



గతంలో ఇన్‌కంటాక్స్ రిటర్న్స్ ఉన్నాయని రేషన్‌కార్డు రద్దు చేశారు. వీటికోసం సచివాలయంలో దరఖాస్తు చేస్తే నెలలోపే కొత్త కార్డు వచ్చింది. నాకు కంటి చూపు సరిగాలేక సచివాలయం ద్వారా సదరం సర్టిఫికెట్ తీసుకోగా పింఛన్ వచ్చింది.

– అడబాల శ్రీనివాస్, లిఖితపూడి, నరసాపురం రూరల్

గత ప్రభుత్వంలో పంచాయతీలో ఉద్యోగులు : నలుగురు
వైఎస్ జగన్ ప్రభుత్వంలో గ్రామ సచివాలయంలో ఉద్యోగులు : 11 మంది

న్యూస్‌రీల్

మెడికల్ కళాశాల పనులు వేగిరపర్చండి



దగ్గులూరులో పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అచ్యుత్ అంబరీస్

పాలకొల్లు అర్బన్ : మెడికల్ కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని నరసాపురం సబ్ కలెక్టర్ డా.అచ్యుత్ అంబరీస్ అధికారులను ఆదేశించారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులు మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని కోరారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సైట్, అండ్ ప్లానింగ్ డీఎంలు గోవిందరావు, దినేష్‌బాబు, లైజనింగ్ ఆఫీసర్ మంచెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా లబ్ధి సంపూర్ణం



కలెక్టరేట్‌లో ఆసరా కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మహిళలు

భీమవరం(ప్రకాశం చౌక్) : స్వయం సహాయక సంఘాలకు వైఎస్ జగన్ ప్రభుత్వం నాలుగో విడత ఆసరా నిధుల విడుదలతో సంపూర్ణ లబ్ధి అందజేసిందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాల్గొన్న ఆసరా నాలుగో విడత నిధులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి డ్వాక్రా మహిళలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 27,004 స్వయం సహాయక సంఘాలలో 2,67,441 మంది మహిళలకు రుణమాఫీ చేసేందుకు వైఎస్సార్ ఆసరా ద్వారా వరుసగా నాలుగో విడతలో రూ.275.90 కోట్ల నగదు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జమ చేయడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

ఈఎస్ఎంఎస్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ రవిప్రకాష్ తదితరులు

భీమవరం (ప్రకాశం చౌక్): ఎన్నికల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు సూచించారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ యాప్ వినియోగంపై భారత ఎన్నికల సంఘం అధికారులు మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ రవిప్రకాష్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. (ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను భారత ఎన్నికల సంఘం రూపొందించిందని, వీటి వినియోగంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించవచ్చని అధికారులు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నిర్వహణ ప్రేరేపిత రహితంగా ఉండాలన్నారు. నిశిత పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. దీని ద్వారా రియల్ టైమ్ రిపోర్టింగ్‌ను సులభతరం చేస్తుందని, వివిధ ఏజెన్సీల నుంచి నివేదికలను సేకరించడం, కంపైల్ చేయడంలో సమయం ఆదాతో పాటు మెరుగైన సమన్వయం అందిస్తుందన్నారు. సెబ్ ఏఎస్పీ ఏటీవీ రవికుమార్, డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, ఈఆర్ఓ లు, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పరిచయ వేదిక రెడీ

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్, పోలవరం అసెంబ్లీ ఇన్‌చార్జిల పరిచయ వేదికకు రేపల్లె వాడలోని వేదిక సిద్ధమైంది. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రీజనల్ కో–ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి హాజరుకానున్నారు. అదేవిధంగా పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కారుమూరి సునీల్, పోలవరం అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మితో సహా ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరుకానున్నారు.

అభివృద్ధికి కేరాఫ్ తణుకు

- రూ.4 కోట్ల విలువైన పనుల ప్రారంభం
- పురోగతిలో మరో రూ.10 కోట్ల పనులు
- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వెల్లడి



పైడిపర్రులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి, చిత్రంలో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, గుబ్బల తమ్మయ్య

తణుకు అర్బన్: ప్రజా సౌకర్యాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని సీసీ రోడ్లు, కల్వర్టులు, బీటీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి రూ.4 కోట్ల నిధులతో పూర్తయిన అభివృద్ధి పనులను మంగళవారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలో రూ.4 కోట్లు పనులు ప్రారంభించామని, మరొక రూ.10 కోట్లు పనులకు సంబంధించి కొన్ని పనులు జరుగుతుండగా మరి కొన్ని మొదలు పెట్టాల్సి ఉందన్నారు. పైడిపర్రు కాలువగట్టు రోడ్డుకు రూ.55 లక్షలు మంజూరు చేసి టెండరు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. 2009లో రహదారులను తామే అభివృద్ధి చేశామని, తరువాత టీడీపీ వచ్చినా ఎటువంటి అభివృద్ధి చేయకపోవడంతో ఇప్పుడు తిరిగి తామే రహదారులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

గతంలో దోచేశారు

గత టీడీపీ హయాంలో ప్రజాధనాన్ని దోచుకో, దాచుకో అనే విధంగా పరిపాలించారని దుయ్యబట్టారు. ఇప్పుడు, అప్పుడు కూడా ఒకే బడ్జెట్ అయినప్పటికీ ఇంతటి సంక్షేమాన్ని టీడీపీ హయాంలో ఎందుకు ఇవ్వలేదని రెండు కండువాలతో మీగుమ్మాల్లోకి వచ్చేవారిని నిలదీయాలని అన్నారు. కోవిడ్‌తో ఆర్థికంగా ఇబ్బందులు పడినప్పటికీ ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని అన్నారు.

రాష్ట్రంలో 3వ స్థానం

పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, పచ్చదనం అంశాలకు సంబంధించి తణుకు మునిసిపాలిటీ రాష్ట్రంలోనే 3వ స్థానంలో నిలిచిందని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. తణుకును మోడల్ మునిసిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేస్తున్నానని, తన హయాంలో రాష్ట్రంలో 3వ స్థానం సాధించినందుకు చాలా గర్వపడుతున్నానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, గుబ్బల సూర్యచంద్రరావు, మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వర‌రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల వివరాలివ్వండి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగుల వివరాలను సంబంధిత శాఖాధిపతులు వెంటనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సచివాలయ ఉద్యోగుల శాఖాధిపతులతో సమావేశమై సచివాలయ ఉద్యోగులను రేషనలైజేషన్ ప్రక్రియలో సర్దుబాటుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది కొరత ఉన్న సచివాలయాలకు ఇతర సచివాలయాల నుంచి సిబ్బందిని రేషనలైజేషన్ ప్రక్రియపై పని సర్దుబాటుకు నియమించాలన్నారు. ఇందుకు సచివాలయాల వారీగా ఆయా శాఖాధిపతులు సిబ్బంది వివరాలను వెంటనే అందజేయాలన్నారు. వార్డు సచివాలయాల్లో సిబ్బంది వివరాలను ఆయా మున్సిపల్ కమిషనర్లు, గ్రామ సచివాలయాల సిబ్బంది వివరాలను ఆయా శాఖాధిపతులు వెంటనే జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారికి అందజేయాలని తెలిపారు. పని సర్దుబాటులో భాగంగా సచివాలయ సిబ్బందిని ఆ మండలానికి దగ్గరలో ఉన్న మండలంలో నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, డీఏఓ జెడ్.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ కె.శ్యామల, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, పీఆర్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, ఉద్యాన శాఖ అధికారి ఎ.దుర్గేష్, పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, మత్స్యశాఖ అధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

పోలింగ్ నమూనా కేంద్రాల పరిశీలన

భీమవరం (ప్రకాశం చౌక్): స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కంట్రోల్ రూమ్‌ల నమూనాలను జేసీ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. ఎక్కడ ఎటువంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు. పేదలందరికీ ఇళ్ల కార్యక్రమానికి సంబంధించి నూతన ఫార్మేట్ ద్వారా లబ్ధిదారులను హక్కుదారులుగా రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి, తొలి రిజిస్ట్రేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు.

లిల్లీ మొక్కలపై పరిశోధనకు ప్రణుతికి పురస్కారం



గుజరాత్‌లో అవార్డును అందుకుంటున్న ప్రణుతి (ఫైల్)

తాడేపల్లిగూడెం : లిల్లీ పూలపై అత్యుత్తమ పరిశోధన చేసిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ కళాశాల (వెంకట్రామన్నగూడెం) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పసుపులేటి ప్రణుతికి యువ శాస్త్రవేత్త కేటగిరీలో జాతీయ స్థాయి పురస్కారం లభించింది. గుజరాత్ రాష్ట్రంలోని నౌసారి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి హార్టీకల్చర్ కాంక్లేవ్-2024 కార్యక్రమంలో, ఇండియన్ సొసైటీ ఆఫ్ హార్టీకల్చర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పురస్కారాలను ప్రదానం చేశారు. బడ్డింగ్ సైంటిస్టు కేటగిరీలో 2021-22 సంవత్సరానికి గాను ప్రణుతికి పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీ వీసీ టి.జానకీరామ్ మాట్లాడుతూ లిల్లీ మొక్కలోని మూడు భాగాల నుంచి టిష్యూ కల్చర్ విధానంలో అధిక సంఖ్యలో నాణ్యమైన అంటు మొక్కలు అభివృద్ధి చేసి, ఉద్యాన రైతులకు అందించే విధానం రూపొందించిన పసుపులేటి ప్రణుతికి, ఆమెకు మార్గదర్శిగా వ్యవహరించిన సీనియర్ శాస్త్రవేత్త కె.రవీంద్రకుమార్‌కు అభినందనలు తెలిపారు. ఉద్యాన సాగు విస్తరింప చేసే ఇలాంటి పరిశోధనలు మరిన్ని రావాలన్నారు. అవార్డు సాధించడంలో వీసీ తదితరులు అందించిన ప్రోత్సాహం మరువలేనిదని ప్రణుతి అన్నారు. ఈ సందర్భంగా ఆమెను రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ హార్టీకల్చర్ పద్మావతమ్మ, ఎస్.సూర్యకుమారి, మల్లికార్జునరావు, ఎం.మాధవి, ఆర్‌వీ సుజాత, ఉషాకుమారి అభినందించారు.

30 లోగా డీఈఎల్ఈడీ పరీక్ష ఫీజు చెల్లించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : త్వరలో నిర్వహించే డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) మూడో సెమిస్టర్ (2022-24 బ్యాచ్) పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఫీజులు చెల్లించడానికి ఉద్దేశించిన షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ విడుదల చేశారని డీఈఓ పీ శ్యామ్‌సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుము లేకుండా ఈ నెల 30 లోగా ఫీజులు చెల్లించవచ్చన్నారు. అభ్యర్థులు నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.250, మూడు సబ్జెక్టులకు రూ.175, రెండు సబ్జెక్టులకు రూ.150, ఒక సబ్జెక్టుకు రూ.125 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.50 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించేందుకు ఫిబ్రవరి 2వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

పండగ చేసుకున్న ఆర్టీసీ

పశ్చిమ ఆర్టీసీకి సంక్రాంతి ఆదాయం రూ.79.07 లక్షలు



భీమవరం (ప్రకాశం చౌక్): సంక్రాంతి పండగకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడపడం ద్వారా పశ్చిమగోదావరి జిల్లా ఆర్టీసీ రికార్డు స్థాయిలో ఆదాయాన్ని పొందింది. జిల్లాలోని నాలుగు డిపోల ద్వారా ఈనెల 10 తేదీ నుంచి 22 తేదీ వరకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయగా పండగ ముందు, తర్వాత సాధారణ చార్జీలకే బస్సులను నడిపింది. ఈ ఏడాది పండగకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయడానికే ఎక్కువ మంది మొగ్గు చూపడంతో ఈ ఆదాయం సాధ్యమైంది. దీంతో ఆర్టీసీ ప్రయాణికులను మరింత చేరువైంది.

పండగకు ముందు.. తరువాత

సంక్రాంతి పండగకు ముందు జనవరి 10 తేదీ నుంచి 16 తేదీ వరకు హైదరాబాద్ నుంచి జిల్లాకు మొత్తం 232 ప్రత్యేక బస్సులు సర్వీసు చేయగా రూ. 48,37,683 ఆదాయం లభించింది. అలాగే పండగ తర్వాత 17 తేదీ నుంచి 22 తేదీ వరకు జిల్లాలోని నాలుగు డిపోలు నుంచి హైదరాబాద్‌కు 124 ప్రత్యేక బస్సులు సర్వీసు చేయగా రూ.30,69,386 ఆదాయం లభించింది.

ప్రైవేట్ దోపిడీకి అడ్డుకట్ట

సంక్రాంతి పండగకు ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణికులను అడ్డంగా దోచుకోవడం అనేది సర్వసాధారణం. అయితే పండగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి సాధారణ చార్జీలు, ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ బారి నుంచి రక్షించారు.

భీమవరం డిపో ముందంజ

సంక్రాంతి పండగకు సమకూరిన ఆదాయంలో భీమవరం డిపో ముందంజలో ఉంది. 123 బస్సు సర్వీసులు తిప్పడం ద్వారా రూ.30,71,080 ఆదాయం సాధించి జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచింది. తణుకు డిపో 96 బస్సులు తిప్పి రూ.22,33,926 ఆదాయం గడించి రెండో స్థానంలో నిలిచింది.

డిపోల వారీగా ఆదాయం వివరాలు

డిపో	ప్రత్యేక బస్సులు	ఆదాయం (రూ.లలో)
భీమవరం	123	30,71,080
నర్సాపురం	74	12,74,548
తాడేపల్లిగూడెం	63	13,27,515
తణుకు	96	22,33,926

ప్రయాణికులు ఆదరించారు



సంక్రాంతి పండగకు ఆర్టీసీకి జిల్లా వ్యాప్తంగా మంచి ఆదాయం లభించడం సంతోషం. పండగ సందర్భంగా ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు బాగా ఆదరించారు. పండగకు ముందు పండగ తర్వాత కూడా ప్రత్యేక బస్సులను నడిపాం. అలాగే సాధారణ చార్జీలకే సర్వీసు చేశాం. ప్రయాణికులు ఇచ్చిన ప్రోత్సాహంతో ముందు ముందు ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఎం.వీరయ్య చౌదరి, ప్రజా రవాణ అధికారి భీమవరం

క్లుప్తంగా

చరిత్రలో నిలిచిపోయే వ్యక్తి సీఎం వైఎస్ జగన్


డాక్టర్ పిడకాల శ్యామ్‌సుందర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని దేశంలోనే మకుటాయమానం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడకాల శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ మేధావి అంబేడ్కర్‌కు అపురూపమైన గౌరవాన్ని ఇవ్వాలని ఆలోచించి దాన్ని ఆచరణలో పెట్టి ప్రపంచం అంతా నివ్వెరపోయేలా వైఎస్ జగన్ చేసి చూపించారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక గౌరవాన్ని తెచ్చిపెట్టిన ముఖ్యమంత్రికి ఏపీ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ తరుపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం విద్యను ప్రవేశపెట్టిన జగన్ దేశంలోనే గొప్ప సీఎంగా ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి పేదవాడు రుణపడి ఉంటాడన్నారు.

సాగుకు సేంద్రియ పద్ధతులే మేలు

- రసాయన ఎరువుల వాడకంతో ఎన్నో అనర్థాలు
- పంటల్లో కనిపిస్తున్న ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు
- ఈ పోషకాలు లోపిస్తే తగ్గిపోనున్న దిగుబడులు
- సేంద్రియ సాగుతో చెక్ పెట్టవచ్చని సూచన


మెట్ట ప్రాంతంలో నిమ్మతోటలో రైతులు పండిస్తున్న వేరుశెనగ పంట


కూరగాయల పంట


పాడి - పంట

చింతలపూడి: నేడు రైతాంగం తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటను పండించడానికి విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. ఫలితంగా భూముల్లో పంటలకు కావలసిన పోషకాలు అందుబాటులో లేక సమతుల్యత లోపించి ముందెన్నడూ లేని విధంగా ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు పంటల్లో కనిపిస్తుంది. ఈ పోషకాలు లోపించినప్పుడు సాగులో మిగతా యాజమాన్య పద్ధతులన్నీ సక్రమంగా పాటించకపోయినా దిగుబడులు తగ్గుతాయి. వీటిని అధిగమించడానికి సేంద్రియ వ్యవసాయ పద్ధతులు మేలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం నాగకుమార్ సూచిస్తున్నారు. చింతలపూడి సబ్ డివిజన్‌లో ఏటా రబీ సీజన్‌లో సుమారు 8,204 ఎకరాల్లో వరి, 27,774 ఎకరాల్లో మొక్కజొన్న, 689 ఎకరాల్లో వేరుశెనగ, 3,341 ఎకరాల్లో పొగాకు రైతులు సాగు చేస్తుంటారు. ఇవికాక మిర్చి, పొద్దుతిరుగుడు, చెరుకు, కూరగాయల పంటలు పండిస్తుంటారు.

ఎరువుగా జిప్సం

జిప్సం రసాయన నామం. జిప్సంలో 24 శాతం కాల్షియం, 18 శాతం గంధకం ఉంటుంది. కాల్షియం, గంధకం మొక్కల పెరుగుదలకు అవసరమైన ద్వితీయ శ్రేణి పోషకాలను అత్యంత చౌకగా జిప్సం ద్వారా అందించవచ్చు. ముఖ్యంగా నూనె గింజలు, పప్పు ధాన్యాల వంటి పంటల్లో గంధకం ఆవశ్యకత అధికంగా ఉంటుంది. కాల్షియం మొక్కల్లోని జీవకణాల అంచులు గట్టిగా ఉండటానికి, కణ విభజనకు, వేర్ల అభివృద్ధికి గింజకట్టడానికి అవసరమవుతుంది. దీనివల్ల మొక్కలకు చీడపీడలను ఎదుర్కొనే శక్తి సమకూరుతుంది. వేరుశెనగ పంటలో జిప్సంను పూత దశలో వేసుకుని భూముల్లో కలియబెట్టడం వల్ల అధిక దిగుబడులు వస్తాయి. కాయలు కూడా గట్టిగా ఉండి కాయ నిండా పప్పు వృద్ధి చెంది గింజల్లో అధిక నూనె శాతం కలిగి ఉంటుంది. ఫలితంగా కాయలు అధిక బరువు కలిగి మంచి ధర పలుకుతాయి. కాబట్టి పూత సమయంలో ఎకరాకు 200 కిలోల చొప్పున భూమిలో తగిన తేమ ఉన్నప్పుడు మొక్కలకు దగ్గరగా వేసుకోవాలి. చీడు, చౌడు భూముల్లో నీరు సరిగా ఇంకదు. గాలి ప్రసరణ తక్కువగా ఉంటుంది. భూమి భౌతిక లక్షణాలు క్షీణించి ఉంటాయి. ఈ పరిస్థితుల్లో మొక్కల వేర్లు సరిగా వృద్ధి చెందక మొక్కల్లో ఎదుగుదల ఉండదు. ఇలాంటి భూముల్లో జిప్సం వినియోగంవల్ల నేల గుల్లబారి భూమిలో నీరు ఇంకే స్వభావం పెరిగి మొక్కల వేర్లు బాగా వృద్ధి చెందుతాయి. పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుంది.


ఎం నాగకుమార్, ఏడీఏ వ్యవసాయ సబ్‌డివిజన్

రిపబ్లిక్ డే గాడ్ ఆఫ్ ఆనర్ ఈవెంట్‌కు ఎంపిక


ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ ఎ.వీరయ్యతో పవన్‌సాయి విఘ్నేష్

టి.నరసాపురం: ఢిల్లీలో కరియప్ప పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 26న జరిగే రిపబ్లిక్‌డే పరేడ్‌లో గాడ్ ఆఫ్ ఆనర్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలం సాయంపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి మారిశెట్టి పవన్‌సాయి విఘ్నేష్ ఎంపికయ్యారు. విఘ్నేష్ భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గత మూడేళ్లుగా ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్నాడు. రిపబ్లిక్ డే పరేడ్ గాడ్ ఆఫ్ ఆనర్‌లో పాల్గొనేందుకు 8 దశల్లో జరిగిన ఎంపికల్లో ప్రతిభ చాటాడు. దేశం మొత్తంగా 100 మంది క్యాడెట్‌లు ఎంపిక కాగా, వారిలో ఏపీ నుంచి 8 మంది ఎంపికయ్యారు. వీరిలో విఘ్నేష్ ఒకరు. ఈ నెల 26న జరిగే గాడ్ ఆఫ్ ఆనర్‌లోను, 27న ప్రధానమంత్రి పాల్గొనే కార్యక్రమంలోనూ గాడ్ ఆఫ్ ఆనర్‌లో విఘ్నేష్ కవాతు చేయనున్నాడు. తన ఎంపికకు భీమవరం కళాశాల ఎన్‌సీసీ విభాగం అధికారి కెప్టెన్ డాక్టర్ ఎ.వీరయ్య శిక్షణ దోహదపడిందని పేర్కొన్నాడు. విఘ్నేష్ తండ్రి మారిశెట్టి దేవవరప్రసాద్ తాపీ మేస్త్రీ కాగా తల్లి సత్యవతి గృహిణి. గాడ్ ఆఫ్ ఆనర్‌కు ఎంపిక కావడం వల్ల ఎన్‌సీసీలో సి-సర్టిఫికెట్ ఎగ్జామ్‌లో 50 మార్కులు యాడ్ అవుతాయని, దీని ద్వారా ఆర్మీలో అధికారి ఉద్యోగానికి వెళ్లేందుకు సులభతరం అవుతుందని విఘ్నేష్ తెలిపాడు.

చైన్ స్నాచర్ అరెస్ట్

ఆగిరిపల్లి: చైన్‌స్నాచర్‌ను మంగళవారం ఆగిరిపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల తోటపల్లి, శోభనాపురం గ్రామాల్లో నడుచుకుంటూ వెళుతున్న ఇద్దరు మహిళల మెడలో నుంచి చిన్నాగిరిపల్లికి చెందిన జువ్వనబోయిన రామకృష్ణ బంగారం గొలుసులు చోరీ చేసి పరారయ్యాడు. ఈ నేపథ్యంలో ఎస్సై చంటిబాబు తన సిబ్బందితో కలిసి దాడి చేసి అతడిని పట్టుకున్నారు. రూ.2 లక్షల 25 వేల విలువ గల రెండు బంగారు చైన్‌లు స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేసి నూజివీడు కోర్టులో హాజరుపరిచారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలూరు (టూటౌన్): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిది అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా న్యాయ సేవా భవన్ నందు మంగళవారం పర్యావరణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఏపీ పొల్యూషన్ బోర్డు ఏలూరు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు, ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి బాధ్యతతో జీవనం సాగిస్తూ, ప్రకృతిని పరిరక్షించడంలో భాగస్వాములు కావాలని అన్నారు. సహజ జీవనవిధానం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని అన్నారు. చెట్లను నాటడం, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఉపయోగించటం, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించడం మొదలైన కార్యక్రమాలను అవలంబించడం ద్వారా కొంతవరకు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అని అన్నారు. ఏలూరు జిల్లా పర్యావరణ రక్షణ బోర్డు ఇంజనీర్ ఈ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యం వ్యర్థాల రీసైక్లింగ్ విధానాన్ని పాటించాలని, విధిగా శుద్ధి చేసిన తర్వాత మాత్రమే వ్యర్థాలను విడుదల చేయాలని సూచించారు. పంటలకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాని, ఎలక్ట్రానిక్, ఆసుపత్రుల నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో డిస్మాండిల్ చేయాలని, ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించి జ్యూట్ వస్తువులను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శేషగిరిరావు, ప్యానల్ లాయర్లు కె.వెంకటేశ్వరరావు, కూనా కృష్ణారావు, కట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

మహిళ హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

ఏలూరు (టూటౌన్): మహిళను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన కేసులో ముద్దాయికి ఏలూరు ఎనిమిదవ అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎం.సునీల్ కుమార్ జీవిత ఖైదు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు, అడిషనల్ పీపీ డి.శ్రీవాణి బాయ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భర్త చనిపోయిన నేపథ్యంలో అల్లాడి దుర్గ తన పుట్టిల్లు అయిన పెదపాడు మండలం ఏపూరులో తల్లిదండ్రుల ఇంటి వద్ద నివాసం ఉంటుంది. ఈ క్రమంలో కృష్ణా జిల్లా బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ ప్రాంతానికి చెందిన బెజవాడ వీర వెంకట శివశంకర్ అనే వ్యక్తి ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. వారిద్దరూ కొంతకాలం సహజీవనం చేశారు. ఈ క్రమంలో 2015 డిసెంబరు 13న ముద్దాయి శివశంకర్ అల్లాడి దుర్గను దిండుతో ఊపిరి ఆడకుండా చేసి అనంతరం ఉయ్యాల చీరతో మృతురాలు తనంతట తాను ఉరి వేసుకున్నట్లుగా సాక్ష్యాలను సృష్టించాడు. దీనిపై అనుమానంతో మృతురాలి తల్లి పోలుకొండ ఝాన్సీ పెదపాడు పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముద్దాయిని అప్పటి ఏలూరు డీఎస్పీ కేజీవీ సరిత అరెస్టు చేసి దర్యాప్తు అనంతరం ఛార్జిషీట్‌ను కోర్టులో ఫైల్ చేశారు. ఈకేసులో ఐపీసీ సెక్షన్ 302, 201 కేసులను నమోదు చేశారు. దీనిపై వాదనలు పూర్తికావడంతో ముద్దాయి శివశంకర్‌కు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కేసులో జీవిత కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. 201 కేసులో మూడేళ్ల శిక్ష, రూ.5వేలు జరిమానాను జడ్జి ఎం.సునీల్ కుమార్ విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పీపీ డి.శ్రీవాణి బాయ్ వాదనలు వినిపించారు. విచారణలో సహకరించిన పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాసరావు, పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ, కోర్టు కానిస్టేబుల్ సీహెచ్ క్రాంతి కుమార్‌లను జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అభినందించారు.

పెదతాడేపల్లి గురుకుల బ్యాండ్‌కు ద్వితీయ బహుమతి



జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి పొందిన పెదతాడేపల్లి గురుకుల బ్యాండ్

తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల బ్యాండ్‌కు జాతీయస్థాయి పోటీల్లో ద్వితీయస్థానం లభించిందని ప్రిన్సిపాల్ బి.రాజారావు మంగళవారం తెలిపారు. రిపబ్లిక్‌డే వేడుకల్లో భాగంగా ఈ నెల 21, 22 తేదీల్లో ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ జాతీయ స్టేడియంలో జాతీయస్థాయి పాఠశాల బ్యాండ్ పోటీలు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 14 పాఠశాలలకు చెందిన బ్యాండ్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. సౌత్‌జోన్ తరపున బాలుర విభాగంలో రాష్ట్రానికి పెదతాడేపల్లి గురుకుల విద్యార్థులు ప్రాతినిధ్యం వహించి రెండోస్థానం సాధించారు. విద్యార్థులకు డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల సెక్రటరీ మహేష్‌కుమార్, రాష్ట్ర సమగ్ర శిక్షణ అభియాన్ అధికారి శ్రీనివాసరావు, కలెక్టర్ పి.ప్రశాంతి, డీఈవో ఆర్.వెంకటరమణ, డీసీఓ సంజీవరావు, ఎంఈఓ హనుమ తదితరులు అభినందనలు తెలిపారు.

29 నుంచి విద్యుత్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పీ. సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏలూరులోని విద్యుత్ భవన్‌లో, తాడేపల్లిగూడెం, నిడదవోలు, జంగారెడ్డిగూడెం, భీమవరం, నరసాపురంలలోని తమ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల కార్యాలయాల్లో ప్రజాభిప్రాయాలను స్వీకరిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిరోజు అన్ని డిస్కమ్‌ల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ కార్యక్రమం ఆయా తేదీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారని, ఈ ధరలపై సందేహాలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులెవరైనా పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ కోసం ఏలూరులోని విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయంలో లేదా ఏదైనా విద్యుత్ డివిజనల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పాదముద్రల సేకరణ


ఎర్రాయిగూడెం సమీపంలో సేకరించిన పాదముద్రలు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం ఎర్రాయిగూడెం సమీపంలో గ్రామస్తులు అనమానిస్తున్నట్లుగా ఉన్న పులి పాదముద్రలను మంగళవారం ఫారెస్ట్ అధికారులు సేకరించారు. వాటిని రాజమండ్రి వైల్డ్‌లైఫ్ ల్యాబొరేటరీకి పంపించారు. ప్రజలెవ్వరూ భయపడవద్దని ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.కృష్ణకుమారి అన్నారు. పాదముద్రలు సేకరించిన వారిలో వైల్డ్‌లైఫ్ సిబ్బంది కె.సుధీర్, ఎం.సోమరాజు, వై.బుచ్చన్నదొర, బీట్ గార్డ్ పాల్గొన్నారు.

జంతువుపై పులి దాడి?

పులిరామన్నగూడెం పరిసర ప్రాంతంలో మేతకు వెళ్లిన జంతువుపై పులిదాడి చేసినట్లు సమాచారం. జంతువుపై పులిదాడి సంఘటనకు సంబంధించి వైల్డ్ లైఫ్ అధికారులు బుధవారం పూర్తి వివరాలు సేకరించేందుకు వెళ్తున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పుష్య శుక్ల త్రయోదశి మంగళవారం సందర్భంగా స్థానిక రామచంద్రరావుపేట లోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలోని ఆంజనేయ స్వామికి తెల్లవారుజామున నగర సంకీర్తనలు, సామూహిక హనుమాన్ చాలీసా, శ్రీరామరక్షా స్తోత్రం పారాయణంలు జరిగాయి. అరిటిపండ్లు అప్పాలు ప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



దాతలకు సత్కారాలు చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం పేదలకు బియ్యం, కిరణా సరుకులు పంపిణీ చేశారు. తిమ్మరాజుపాలెం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, జిల్లా డిప్యూటీ గవర్నర్ పదంకుమార్ గుప్తాలు మాట్లాడారు. ఎన్నో సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలు మదన్ మోహన్ అగర్వాల్, అనితలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వంగపండు రామమోహన్‌రావు, సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట జగదీష్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య, కైండ్‌నెస్ క్లబ్ ఆధ్వర్యంలో జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు సహకారంతో మంగళవారం భవిత కేంద్రంలో సేవా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కుందుం వెంకటేశ్వరరావు, కె.సాయి సత్యనారాయణరాజు, యర్రా ఆంజనేయస్వామి, జామి సత్యనారాయణ, ఎం.వెకటరత్నం, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులకు మార్కెటింగ్‌పై అవగాహన ఉండాలి

తాడేపల్లిగూడెం: ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు మార్కెటింగ్‌పై కూడా అవగాహన కలిగి ఉండాలని ఉద్యానవర్సిటీ విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ కోరారు. వెంకట్రామన్నగూడెంలోని కెవికెలో సేంద్రీయ , ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం ప్రారంభమైన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ప్రణాళికలో భాగంగా చేపట్టిన ఈ శిక్షణలో కరుణశ్రీ మాట్లాడుతూ ఈ వ్యవసాయంలో కలుపు , సస్యరక్షణ పద్ధతులు, యాజమాన్యపద్ధతుల గురించి వివరించారు. కెవికె శాస్త్రవేత్త ఎం.రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ జీవన ఎరువుల వినియోగం, అజుల్లా పెంపకంపై వివరించారు. రైతులకు జీవామృతం, అగ్నిఅస్త్రం, బీజామృతం తయారీపై శిక్షణను ఇచ్చారు. 40 మంది రైతులు పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు జి.శాలిరాజు, కె.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని కరగట్టు, 12 వార్డు ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక కరకట్టు ప్రాంతం నుంచి పశువుల ఆస్పత్రి వరకు సీసీరోడ్డు, తాడేపల్లి చెరువు సమీపం నుంచి పాతూరు ప్రాంతం సీసీ రోడ్ల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కర్రి భాస్కరరావు చేతుల మీదుగా శంకుస్థాపనలు నిర్వహించారు. వార్డు ఇన్‌ఛార్జ్ చామన సూర్యచంద్రరావు, కోడే సత్య శ్రీనివాస్, ఆరమిల్లి రవి పాల్గొన్నారు.

కవి ప్రసాద్‌కు ఉత్తమ పురస్కారం

తణుకు: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న హైదరాబాదులో నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ ఉత్తమ పురస్కారం అందుకున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కవి ప్రసాద్ రచించి చదివి వినిపించిన విగ్రహాలు అనే కవితకు పురస్కారం లభించింది. ఈ మేరకు వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షుడు ఈశ్వరి భూషణం, చిట్టే లలిత చేతుల మీదుగా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

- తణుకు నియోజకవర్గంలో 20,100 పశువులు
- ఇంటిగుమ్మంలోకే వ్యాక్సిన్‌లు
- ఇప్పటికి 85 శాతం పూర్తి



తణుకులో మంత్రి కారుమూరి సమక్షంలో ఆవుకు టీకా వేస్తున్న పశువైద్యులు, సిబ్బంది (ఫైల్)

తణుకు అర్బన్: పశు సంపద వ్యాధులబారిన పడకుండా సంరక్షించడమే కాకుండా రైతాంగానికి అండగా నిలబడాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోంది. ఇంటి గడపలోకే పశు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా పశువుల చెంతకే వ్యాక్సిన్‌లు సైతం పశువైద్యశాల సిబ్బంది వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పశువుల్లో తరచూ కనిపించే గాలికుంటు వ్యాధిని అరికట్టేందుకు గాలికుంటువ్యాధి నిరోధక టీకాలను పశువులకు ఈనెలలో ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. ఈనెల 1వ తేదీన ప్రారంభించిన ఈ స్పెషల్ డ్రైవ్ 31వ తేదీతో ముగుస్తుందని పశు వైద్యశాల వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా పశు సంపద ఉన్న రైతుల ఇంటి గుమ్మంలోకే వెళ్లి ఈ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు పశువైద్యశాల సిబ్బంది వేస్తున్నారు.

తణుకు నియోజకవర్గంలో...

తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో పశువైద్యశాల గణాంకాల ప్రకారం 20,100 గేదెలు, ఆవులు ఉండగా, వాటన్నింటికీ వ్యాక్సిన్స్ వేసేలా ఈనెల 1వ తేదీ నుంచి మొదలుపెట్టిన ఈ స్పెషల్ డ్రైవ్‌ను తణుకులో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతులమీదుగా ప్రారంభించారు.

నియోజకవర్గంలో టీకాలు ఇలా..

పశువుల	సంఖ్య	వ్యాక్సిన్ వేసినవి
తణుకు	5950	5248
అత్తిలి	6000	5240
ఇరగవరం	8150	7340

నియోజకవర్గంలో 6 టీంల ద్వారా ఈ డ్రైవ్ నిర్వహిస్తుండగా ఇప్పటివరకు 85 శాతంతో 17,788 పశువులకు విజయవంతంగా పశు వైద్యశాల సిబ్బంది ఈ వ్యాక్సిన్స్ వేశారు.

పశువుల్లో గాలికుంటు వ్యాధి నష్టాలివే..

గాలికుంటు వ్యాధి సోకిన గేదెలు, ఆవులు తిండి తినకుండా నీరసించి పోతాయని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా పాల ఉత్పత్తి క్రమేపి తగ్గిపోతుండడం, తీవ్రమైన జ్వరం, నోరు, కాలి గిట్టల మధ్య పుండ్లు ఏర్పడడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి కోల్పోయి అనేక రకాల రోగాలకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం



గేదెలు, ఆవుల్లో తలెత్తే గాలి కుంటు వ్యాధిపట్ల పశు పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. ఏడాదికోసారి నిరోధక టీకాలను పశువులకు వేయించడం ద్వారా ఈ వ్యాధిని నివారించుకోవచ్చు. పశు పెంకందారుల సౌకర్యార్థం ప్రభుత్వం ఈ వ్యాక్సిన్‌ను పశువులున్న ఇంటి గుమ్మంలోకే వెళ్లేలా కార్యాచరణ చేసి ఉచితంగా పశువైద్యశాల సిబ్బంది ద్వారా అందిస్తుంది.

– డాక్టర్ కె.నరసింహారావు, అత్తిలి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు

ఇంటి గుమ్మంలోకే పశు వైద్య సేవలు



నాకున్న 4 గేదెలతో పాలు ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నాను. అయితే గతంలో పశువులకు ఏ వ్యాధి సోకినా పశువైద్యశాలకు తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు ఇంటి గుమ్మంలోకే పశు వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. మా గేదెలకు ఈనెల మొదట్లో గాలి కుంటువ్యాధి టీకాలు పశువైద్యశాల సిబ్బంది వచ్చి వేశారు. ప్రతి ఏడాది ఈ వ్యాక్సిన్ వేయించడం ద్వారా పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా నిరోధించవచ్చని వైద్యులు చెప్పారు.

– సఖినాల రామకష్ణ, రైతు, తణుకు

వాన్‌బరీ రసాయన కర్మాగారంలో మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న ఫైర్ సిబ్బంది, కార్మికులు

తణుకు/ఇరగవరం: ఇరగవరం మండలం కె.ఇల్లిందలపర్రు గ్రామంలోని వాన్‌బరీ రసాయన కర్మాగారంలో కలకలం రేగింది... కర్మాగారంలో అగ్నిప్రమాదం జరిగిందనే సమాచారంతో కార్మికులు, స్థానికులు ఆందోళన చెందారు... ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతోపాటు ఫైర్, పోలీసులు, రెవెన్యూ, రవాణా శాఖ అధికారులు హుటాహుటిన కర్మాగారానికి చేరుకోవడంతో ఉత్కంఠ నెలకొంది... ఇదంతా చూస్తే ఏదో పెను ప్రమాదం జరిగిందని భావించారు. అయితే ఇదంతా మాక్ డ్రిల్ అని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా పరిశ్రమల ఉప ముఖ్య తనిఖీ అధికారి ఆర్.త్రినాథరావు ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ పదో బెటాలియన్ కమాండర్ ముఖేష్‌కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి ఎం.శ్రీనివాసరావు, తణుకు ఎంవీఐ సంజయ్‌కుమార్, తణుకు అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్, ఇరగవరం తహసీల్దార్ మాలతి, పరిశ్రమల ప్రాంతీయ అధికారి రామకృష్ణ, సర్పంచ్ నాగమణి, వాన్‌బరీ సంస్థ జీఎం మూర్తి, మానవవనరుల డిప్యూటీ మేనేజర్ టి.వెంకటేశ్వరరావు, లైజినింగ్ అధికారి చుంచుల వెంకటేశ్వరరావు, సేఫ్టీ మేనేజర్ వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



బహుమతులు అందుకున్న ఆర్టీసీ సిబ్బందితో ఎంవీఐ సంజీవ్‌కుమార్, మేనేజరు గిరిధర్‌కుమార్

తణుకు అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ జి.సంజీవ్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా తణుకు ఆర్టీసీ డిపోలో మంగళవారం మెయిన్‌టెనెన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి బస్సును డ్రైవర్ సూచనల మేరకు గ్యారేజీ సిబ్బంది పరిశీలించి లోటు పాట్లను సవరించి బయటకు వదిలే పరిస్థితి కారణంగానే ఆర్టీసీ బస్సులు ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేరుస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా గ్యారేజీలో నాణ్యమైన సేవలందించిన సూపర్‌వైజర్ యండమూరి వీరవెంకట ప్రసాద్, మెకానిక్స్ రుత్తుల సత్యనారాయణ, కట్టా శివ ముసలయ్య, కప్పల సన్నిబాబు, మహమ్మద్ షరీఫ్‌లను ప్రత్యేకంగా సత్కరించి బహుమతులు అందచేశారు. డిపో మేనేజరు సప్పా గిరిధరకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ వెన్నా రమణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, గ్యారేజ్ ఇన్‌చార్జ్ గూడూరి శ్రీనివాసరావు, సీనియర్ ట్రాఫిక్ ఇనస్పెక్టర్స్ తన్నీరు పున్నయ్య, బొబ్బా వెంకట కృష్ణారావు, సీనియర్ డ్రైవింగ్ ఇనస్పెక్టర్ ఉనికిలి నిత్య కల్యాణరాజు పాల్గొన్నారు.

నేడు తణుకులో సేవా పురస్కారాలు, సేవకుల సదస్సు



తణుకులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి తదితరులు

తణుకు అర్బన్: సేవా పురస్కారాలు, సేవకుల సదస్సు నిర్వహణ అభినందనీయమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం సేవా పురస్కారాలు, సేవకుల సదస్సు పోస్టర్‌ను మంత్రి కారుమూరి ఆవిష్కరించారు. తణుకు పద్మశ్రీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మంత్రి కారుమూరి, ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ, అంతర్జాతీయ వర్తమానికులు వైఎస్ విమలారెడ్డి, పలువురు ప్రముఖులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, మనోజ్‌బాబు, ముర్రాల సుధాకర్, వేల్పూరు గ్రామ అధ్యక్షుడు నున్న దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

గ్రంథాలయ భవన నిర్మాణ శంకుస్థాపన సభలో మంత్రి కారుమూరి



తణుకులో గ్రంథాలయ భవన నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కారుమూరి, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ తదితరులు

తణుకు అర్బన్: సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు బ్యాంక్ కాలనీలో రూ. 1.03 కోట్లు నిధులతో తణుకు ప్రథమ శ్రేణి గ్రంథాలయ భవన నిర్మాణానికి మంగళవారం మంత్రి కారుమూరి శంకుస్థాపన పూజలు నిర్వహించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ముఖ్యంగా తణుకులో శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవన ప్రాంతంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. గ్రంథాలయాలయాలు విజ్ఞాన బాండాగారాలని చదువరులంతా సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. ఈ గ్రంథాలయంలో పూర్తి స్థాయిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

ఆధునిక వసతులతో గ్రంథాలయం..

గ్రంథాలయంలో ఉండే పుస్తక సంపద ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ అన్నారు. విజ్ఞానం అందించే గ్రంథాలయ భవనాల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతోనే థిలావస్థకు చేరిన భవనాన్ని తొలగింపచేసి నూతన భవన నిర్మాణానికి కృషి చేసినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ఆధునిక వసతులున్న భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి చదువరులకు మంచి వాతావరణాన్ని కలుగచేస్తామని చెప్పారు.

విద్యార్థి ఉన్నతికి గ్రంథాలయాలే తోడ్పాటు..

పుస్తక సంపద కొలువుతీరే గ్రంథాయాలు మంచి విజ్ఞానాన్ని అందిస్తాయని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. తణుకులాంటి ప్రాంతంలో గ్రంథాలయ ఆవశ్యకత ఎంతో ఉందని స్పష్టం చేశారు. నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 1.03 కోట్లు నిధులు కేటాయించడం శుభసూచకమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, డీఈఈ నాగబాబు, ఏఈ సదాశివరావు, లైబ్రేరియన్ సుగుణకుమారి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, 25వ వార్డు నాయకులు రేలంగి రాంబాబు, జిలాని, సురేష్‌రెడ్డి, కలవపూడి బాబు, ఎ.శ్రీనివాస్, కాంట్రాక్టర్ బలగం సోమేశ్వరరావు, గుబ్బల సూర్యచంద్రరావు, పిల్లి సూరిబాబు, తాడిపర్తి వాసు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు అవశ్యం



వీరంపాలెంలో భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు

తాడేపల్లిగూడెం: భూసార పరీక్షలను క్రమం తప్పకుండా చేయిస్తుంటే ఆరోగ్యవంతమైన పంటలను పండించవచ్చని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం వ్యవసాయ కళాశాల రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా గూడెం మండలం వీరంపాలెం గ్రామంలో భూసార పరీక్షలను నిర్వహించారు. మట్టి నమూనాల సేకరణ విశ్లేషణ, పంట పొలాల్లో చీడపీడల నిర్ధారణ అనే అంశాల మీద వ్యవసాయ కళాశాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.ఉషారాణి వివరించారు. వ్యవసాయం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, లాభాలు గమనించి భూసారాన్ని పరిరక్షించుకోవాలన్నారు. రైతు నేల స్వభావాన్ని గమనించి ఏ పోషకాలు తగ్గాయో, ఆ పోషకాలను మాత్రమే నేలకు అందించడం వల్ల మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. కొందరు రైతుల పొలాలనుంచి మట్టి నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ చవాన్ శ్యామ్ రాజ్ నాయక్, డాక్టర్ పి.అమ్మాజీ, డాక్టర్ జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

25న ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు: ఈనెల 25న గురువారం అలంపురం వెంకటరమణ సేవా ఆస్పత్రికి ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు ప్రతినిధి కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ సర్జన్, వైద్యులతో పాటు, ప్రత్యేకంగా కార్డియాలజీ, గైనకాలజీ, అంకాలజీ వైద్యనిపుణులు రానున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిబిరంలో 2డి ఈకో, ఎక్స్‌రే, ఈసీజీ, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభించబోయే ఈ శిబిరానికి రేషన్, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులతో పాటు, పాత రిపోర్టులు తప్పక తీసుకొని రావాలన్నారు. రాజమండ్రి రాజానగరంకు చెందిన జీఎస్ఎల్ కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విధుల్లోకి అంగన్‌వాడీలు



ప్రత్తిపాడు సీడీపీవో కార్యాలయంలో విధుల్లో చేరుతున్న అంగన్‌వాడీలు

పెంటపాడు: అంగన్‌వాడీ వర్కర్లు సమ్మెను విరమించడంతో అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా తెరుచుకున్నాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై నమ్మకం ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమ్మె విరమణకు ముందుగా విధుల్లోకి చేరారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, యువతులకు సేవలు కొనసాగుతుండగా ప్రభుత్వం హామీతో 42 రోజుల తరువాత సమ్మెను విరమణ చేసిన వర్కర్లు మంగళవారం నుంచి కేంద్రాలకు వెళ్లి విధుల్లో చేరారు. ప్రాజెక్టు పరిధిలో మండలంలో సమ్మె విరమణకు ముందుగానే సుమారు 19 కేంద్రాల్లో 25మంది వర్కర్లు విధుల్లో చేరారు. మంగళవారం కేంద్రాల నుంచి వచ్చి ప్రత్తిపాడులోని ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున చేరుకొన్నారు. వారు విధులలోకి చేరుతున్నట్లు సీడీపీవో టీఎల్ సరస్వతికి లిఖిత పూర్వక లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీవో సరస్వతి మాట్లాడుతూ తల్లులకు, చిన్నారులకు సేవలు చేసుకొని సెంటర్లను వదిలి వెళ్లరాదని కోరారు. విధుల్లోకి చేరిన వారికి కచ్చితమైన భవిష్యత్తు ఉంటుందని సీడీపీవో సరస్వతి ఈ సందర్భంగా తెలిపారు. గణపవరం, పెంటపాడు, గూడెం పట్టణం, రూరల్, గ్రామాలకు చెందిన సుమారు 537 మంది వర్కర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తణుకు ఎస్ఈబీ సీఐగా శ్రీనివాసరావు

తణుకు: తణుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐగా బి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా తుని నుంచి బదిలీపై వచ్చిన శ్రీనివాసరావు తణుకు సీఐగా నియమితులయ్యారు. ఈయన స్థానంలో తణుకు సీఐగా పనిచేసిన ఆర్.సత్యవతి కృష్ణాజిల్లా నందివాడకు బదిలీపై వెళ్లారు. సీఐ శ్రీనివాసరావును ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది అభినందించారు.

భారీ అన్నసమారాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని మహంకాళమ్మ జాతర సందర్భంగా మంగళవారం ఆలయం వద్ద 25 వేల మందికి భారీ అన్నసమారాధన జరిగింది. నవోదయ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేతాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి



గూడెంలో నేతాజీకి నివాళులర్పిస్తున్న వాకర్స్ సభ్యులు



తణుకులో నేతాజీకి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నేతాజీ ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని వాకర్స్ అధ్యక్షుడు దూలం నాగురాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని వాకర్స్ భవనంలో మంగళవారం వాకర్స్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిప్పడ గురుమూర్తి, కప్పల నరసింహమూర్తి, కేవీ చలం, రాగిరెడ్డి నాగ వర ప్రసాద్, బాకా వెంకటేశ్వరరావు, మాకా శ్రీనివాసరావు, యోహాను, తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం అహర్నిశలు శ్రమించిన దేశ భక్తుడు నేతాజీ

తణుకు టౌన్: భారత స్వాతంత్ర్య సమరయోధుడు, జయంతి తప్ప వర్ధంతిలేని మహోన్నత వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు చెప్పారు. మంగళవారం తణుకులోని మారుతీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం కోసం సుభాష్ చంద్రబోస్ అలుపెరగని పోరాటం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిట్నీడి నాగరాజు, కిడ్స్ ఎవెన్యూ స్కూల్ ప్రిన్సిపాల్ మద్దాల త్రిమూర్తులు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కె లక్ష్మణరావు, వీఆర్ శ్రీధర్, కేవీఎస్‌డీ ప్రసాద్, ఎం మోహనరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రాయపురం పాఠశాలలో. ...

నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి వేడుకలను తణుకు మండలం వెంకట్రాయపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పెదపాటి గోపాలకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి విద్యార్థులతో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎన్ అమ్మాజీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.